క్లుప్తంగా

నిరుపేదలకు సాయం



నిరుపేదలకు సరకులు అందిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

బీచ్ రోడ్డు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని నిరుపేదలకు చారిటీ బాక్స్ అండగా నిలిచింది. నగరంలోని పలు ప్రాంతాల్లో 50 నిరుపేద కుటుంబాలకు శుక్రవారం నిత్యావసర సరకులు అందజేసింది. ఈ కార్యక్రమంలో చారిటీ బాక్స్ ప్రతినిధి చెక్కా రమాదేవి, శంకరరావు, కరుణాకర్, లక్కోజు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి సారె ఊరేగింపు



సారె ఊరేగిస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ: సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీగోదాదేవి అమ్మవారి పెండ్లి సారె సమర్పణ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. తొలుత పసుపు, కుంకుమ, పండ్లు, వివిధ రకాల పువ్వులు, సీట్లు, చీరలు పట్టుకుని వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ఎదుర్కోలు ఉత్సవంలో భాగంగా అమ్మవారు, స్వామివార్ల ప్రవరలు, లగ్నపత్రిక చదివి భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

14న మకరజ్యోతి దర్శనం



విశేష అలంకరణలో అయ్యప్పస్వామి

అల్లిపురం: అయ్యప్ప స్వామి మకర జ్యోతి పూజ, దర్శనం ఈ నెల 14వ తేదీన టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు సాయిశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగే ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, జ్యోతి దర్శనం చేసుకుని తరించాలని కోరారు.

4.3 కిలోల గంజాయి స్వాధీనం

పెదగంట్యాడ: వెంకన్నపాలెం సమీపంలోని డాల్ఫిన్ లే-అవుట్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని న్యూపోర్టు పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగవరం ధారపీధికి చెందిన చేపల ఆనంద్, దయాల్‌నగర్‌కు చెందిన ఆసనాల శామ్యూల్ అలియాస్ పాము కళ్లు, ఆసనాల సురేష్ అలియాస్ సాహెబ్ పాడేరు నుంచి గుర్తు తెలియని వ్యక్తి ద్వారా గంజాయి తీసుకొచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లు కట్టి గంగవరం పోర్టుకు వచ్చే లారీ డ్రైవర్లు, కూలీలకు విక్రయిస్తుంటారు. శుక్రవారం కూడా వీరు వెంకన్నపాలెం సమీపంలోని డాల్ఫిన్ లే-అవుట్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో న్యూపోర్టు ఎస్ఐ మన్మథరావు సిబ్బందితో కలసి దాడులు చేశారు. వారి నుంచి 4.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

రైతుబజార్‌కు పండగ శోభ



రైతు బజార్‌లో విక్రయిస్తున్న చెరకుగడలు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు రైతుబజార్‌కు పండగ శోభ ముందుగానే వచ్చింది. పెద్ద పండగగా పిలిచే భోగి, సంక్రాంతి, కనుమ జరుపుకోవడానికి నగరవాసులు సిద్ధమవుతున్నారు. ఇందుకు అవసరమైన కూరగాయలు, పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి రైతుబజార్ బాట పడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి పెదవాల్తేరు రైతుబజార్‌కు పెద్ద సంఖ్యలో వినియోగదారులు రావడం కనిపించింది. సంక్రాతి రోజున ఆలయాల్లో పితృదేవతల కోసం ఇచ్చే స్వయంపాకం(పాత్తర్ల)లో వినియోగించడానికి కంద, గుమ్మడి కాయ, అరటి, చిక్కుడు, తోటకూర వంటివి అధికంగా కొనుగోలు చేశారు. వినియోగదారుల సౌకర్యార్థం కంద, గుమ్మడిని ముక్కలుగా కోసి రూ.10 చొప్పున విక్రయించారు. గిరిజన రైతులు ఎర్రటి చెరకు గడలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. చిన్నది రూ.30కి, పెద్దది రూ.40కి అమ్మకాలు జరుపుతున్నారు. రానున్న మూడు రోజుల పండగ సమయంలో ఇంటికి అవసరమైన కూరగాయలు, కిరాణా సరకులను సైతం రైతుబజార్‌లోని స్టాళ్లలో కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. పెద్ద సంఖ్యలో వినియోగదారులు రావడం, విక్రయాలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆది, సోమవారాలలో కొంత మేర విక్రయాలు తగ్గే అవకాశం ఉంది. దీనికి అనుగుణంగా రైతులు అవసరమైన కూరలు, ఆకుకూరలు తీసుకువచ్చి విక్రయాలు చేపడుతున్నారు.

బోసిపోయిన ఆరిలోవ

ఆరిలోవ: సంక్రాంతి వస్తే గ్రామాలు, కాలనీలు సందడిగా కనిపిస్తాయి. అందరూ ఒకేచోట చేరి సరదాగా గడుపుతారు. ఆరిలోవలో మాత్రం ఈ సందడి కనిపించదు. సంక్రాంతి వస్తే ముందు రోజు నుంచి ఆరిలోవ ఖాళీ అయిపోతుంది. ఇక్కడ శుక్రవారం నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. ఆరిలోవలో ఉన్నవారిలో 80 శాతం పైగా ప్రజలు సంక్రాంతి జరుపుకోవడానికి సొంత గ్రామాలకు వెళ్లిపోయారు. దీంతో ఆరిలోవ బోసుపోయింది. నిత్యం వాహనాలు రాకపోకలతో సందడిగా ఉన్న రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. నగరం నుంచి వచ్చిపోయే ఆర్టీసీ సిటీ బస్సుల జాడే తప్ప ఆటోలు, కార్లు , ద్విచక్ర వాహనాలు అంతంత మాత్రంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఆరిలోవ నుంచి సొంతూళ్లకు వెళ్లే వారితో హనుమంతవాక, డెయిరీ ఫారం కూడళ్లు కిటకిటలాడాయి. శ్రీకాకుళం, విజయనగరం వెళ్లే బస్‌లు కూడా రద్దీగా మారాయి. ప్రయాణికులు బస్సులు ఎక్కలేని పరిస్థితి నెలకొంది.



గుమ్మడి, ఆనప, కంద ముక్కలు విక్రయాలు జరుపుతున్న రైతులు



ఆరిలోవలో ఖాళీగా ఉన్న రోడ్డు

భరత్‌నగర్‌లో సంక్రాంతి సందడి

ఆరిలోవ: స్థానిక భరత్‌నగర్‌లో శుక్రవారం సంక్రాంతి సందడి నెలకొంది. ఉత్తరాంధ్ర జానపద సంగీత కళాపీఠం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మహిళలకు ముగ్గులు పోటీలు, జానపద కళాకారులకు నృత్య పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు పోటీపడి రంగు రంగుల ముగ్గులు వేసి ప్రతిభ చూపారు. చిన్నారుల భరత నాట్యం, కళాకారుల జానపద నృత్యాలతో అలరించారు. ముగ్గుల పోటీల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. భరత నాట్యం, జానపద నృత్యాలలో ప్రతిభ కనబరిచిన వారికి విశ్రాంత మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.భాస్కరరావు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రముఖ అథ్లెటిక్ క్రీడాకారుడు పి.ప్రభుదాస్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జానపద సంగీత కళాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.భగవాన్‌దాస్ మాట్లాడుతూ నేటి తరానికి సంక్రాంతి సందడి, జానపద నృత్యాల గురించి తెలియజేయడానికి ఈ వేడుకలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



భరత్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ముగ్గులు వేస్తున్న మహిళలు



నృత్యం చేస్తున్న చిన్నారి

డీసీఎంఎస్ బీవోఎస్ ఛైర్మన్‌గా వెంకటేశ్వర్లు



వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చెర్మన్‌గా ఆచార్య పి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం విభాగంలో బీవోఎస్ చెర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆచార్య వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం గౌరవ గ్రంథాలయాధికారిగా సేవలు అందిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల వార్డెన్‌గా కూడా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లును విభాగ ఆచార్యులు, ఉద్యోగులు అభినందించారు.

ఊరెళ్తే.. సమాచారం ఇవ్వండి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్ తదితరులు

ఎంవీపీ కాలనీ: సంక్రాంతికి సొంతూళ్లు వెళ్లేవారు ఆయా ప్రాంతాల పరిధిలోని పోలీసు స్టేషన్లలో ముందస్తు సమాచారం ఇవ్వాలని 3వ పట్టణ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 3వ పట్టణ పోలీసు స్టేషన్ క్రైం ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సిరిపురం, సంపత్ వినాయగర్ టెంపుల్, మద్దిలపాలెంతో పాటు పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరెళ్లేవారు పోలీసు స్టేషన్లలో ముందస్తు సమాచారం అందిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. రాత్రి గస్తీ ముమ్మరం చేయడంతో పాటు అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేస్తామన్నారు. పండగ నేపథ్యంలో అనుమానిత వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా భోగి మంట



భోగి మంటలు వేసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు భోగి మంటలు వేసి వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. పిఠాపురం కాలనీలోని సీపీఎం కార్యాలయం వద్ద శుక్రవారం భోగి మంట వేసి స్టీల్ ప్లాంట్‌ను విక్రయించొద్దంటూ నినాదాలు చేశారు. నిరసనగా భోగి మంటలో ఒక్కో కట్టె వేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కె.ఎం.కుమార్ మంగళం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అమ్మేస్తామని ప్రధాని మోదీ ప్రకటించి రెండేళ్లు గడుస్తోందన్నారు. నాటి నుంచి నేటి వరకూ ప్రజా సంఘాలతో కలిసి నిరంతరం పోరాటాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం చేయాలని చూస్తే బీజేపీ ప్రభుత్వానికి ప్రజా సంఘాలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మణి, సీతామహాలక్ష్మి, పి.వెంకటరావు, జె.ఆర్.నాయుడు, శ్రీను, వరలక్ష్మి, కె.కుమారి పాల్గొన్నారు.

పరిపాలన రాజధానిలో జర్నలిస్టుల పాత్ర కీలకం



రామచంద్రరావును సన్మానిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

బీచ్ రోడ్డు: విశాఖ పరిపాలన రాజధానిలో మధురవాడ జర్నలిస్టుల పాత్ర కీలకమని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ సభ్యుడు ఆర్.రామచంద్రరావు అన్నారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన మధురవాడ జర్నలిస్ట్ క్లబ్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ జర్నలిస్టుల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అండగా ఉంటాయన్నారు. జర్నలిస్టుల విలువలను కాపాడుతూ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధురవాడ జర్నలిస్ట్ క్లబ్ నూతన అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి అనీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా త్యాగరాజ కచేరీ



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం: త్యాగరాజ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరాధన ఉత్సవాలలో మూడో రోజు శుక్రవారం త్యాగరాజ కృతులను శ్రావ్యంగా ఆలపించి అలరించారు. త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు పంతులు గోపాలరావు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకూ వరుసగా కచేరీలు కొనసాగాయి. వర్ధమాన కళాకారులు తమ గానంతో మైమరిపించారు. ఎనిమిది బృందాలు చిన్నారులు లయబద్ధంగా కృతులను ఆలపించి రంజిప చేశారు. ఏయూ సంగీత విభాగాధిపతి ఆచార్య ఎం.జలజాక్షి చక్కని గాత్రంతో పాటలు పాడారు. మండపాక శ్రీదేవి వీణానాదం అందరిని తన్మయపరిచింది. డాక్టర్ వెంపటి చినసత్యం కళాక్షేత్రం విద్యార్థిని చొప్పల సింధుజ త్యాగరాజ కృతులకు కూచిపూడి నృత్యంతో అబ్బురపరిచింది.

గోదాదేవి కల్యాణం నేడు



ప్రత్యేక అలంకరణలో గోదారంగనాయకులు

సీతంపేట: భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని అక్కయ్య పాలెం లలితా పీఠం, శ్రీనివాసనగర్ శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం, సీతంపేట రాధాకృష్ణ మందిరంలో శనివారం గోదాదేవి, రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లలితా పీఠంలో ఉదయం 9గంట ల కు గోదారంగనాయకుల దివ్య కల్యాణ మహోత్సవం సామూహికంగా జరుగుతుందని, అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు గోదా రంగనాయకుల కల్యాణం జరుపుతామని ఆలయ అర్చకుడు సంబాళ వేంకట కూర్మాచార్యులు చెప్పారు. ఈమేరకు ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ ఆర్గనైజర్లు

దాబాగార్డెన్స్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటుకు మంచి అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంఏ రహీం తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లతో పీఎంఎఫ్ఎంఈ స్కీంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా ఆహార శుద్ధి రంగంలో గల వివిధ అవకాశాలు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కొత్తగా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగ యువత, స్వయం సహాయక బృందాలు, సభ్యులు ఒక్కరిగా గానీ, గ్రూప్‌గా గానీ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని చెప్పారు. పీఎంఎఫ్ఎంఈ స్కీం ద్వారా కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుకయ్యే మొత్తం ఖర్చులో 10 శాతం రుసుం లబ్ధిదారులు భరించగా, 90 శాతం రుసుం బ్యాంక్ ద్వారా లోన్ రూపంలో అందజేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమ ఏర్పాటు పూర్తయిన తర్వాత ప్రభుత్వ సహకారంగా 36 శాతం సబ్సిడీ బ్యాంకుకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. గరిష్ఠంగా ప్రభుత్వ సబ్సిడీ రూ.10 లక్షల వరకు సహాయం చేసే అవకాశాలున్నాయని చెప్పారు. ఇప్పటికే ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉన్న వారు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమను ఇంకా అభివృద్ధి చేసుకోవడానికి కూడా ఈ సబ్సిడీ పొందవచ్చన్నారు. ఆసక్తి గల వారు 7995087039, 6304930318, 9700051235 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఆంధ్రా బాడీ బిల్డర్లు

మిస్టర్ ఇండియా పోటీల్లో రన్నరప్‌గా రాజేష్



మిస్టర్ ఇండియా పోటీల్లో సత్తా చాటిన రాజేష్

అల్లిపురం : పశ్చిమబెంగాల్లో ఈ నెల 11,12 తేదీల్లో జరిగిన 57వ మిస్టర్ ఇండియా-2023 పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొని తమ సత్తాచాటారు. దేశ నలుమూలల నుంచి 29 రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 65 కేజీల విభాగంలో పోటీపడ్డ రాజేష్ ప్రథమ స్థానంతో పాటు ఓవరాల్ ఛాంపియన్ షిప్ రన్నరప్‌గా నిలిచి ఆంధ్రప్రదేశ్ కీర్తి, ఖ్యాతిని దేశం నలుమూలలా చాటారు. అలాగే 70 కేజీల కేటగిరీలో సంగడి రమేష్ ద్వితీయ స్థానం సాధించగా, 80 కేజీల విభాగంలో నార్ని శివదుర్గా అవినాష్ మూడో స్థానం సాధించారు. మాస్టర్ విభాగంలో కె.రామునాయుడు నాలుగో స్థానంలో సత్తా చాటారు. ఏపీ నుండి పాల్గొన్న వారందరూ టాప్ 10లో నిలిచారు. మిస్టర్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారందరికీ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.గురునాథరావు, కోశాధికారి టి.రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వి.విజయకుమార్, జోగి కిరణ్, ఉపాధ్యక్షుడు బీపీ రెడ్డి, జి.విష్ణుమూర్తి అభినందనలు తెలిపారు.

20 నుంచి గ్రూప్-2 కోచింగ్



కోచింగ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్టడీ సర్కిల్ ప్రతినిధులు

ఉక్కునగరం: అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి స్టడీ సర్కిల్ సారథ్యంలో జనవరి 20 నుంచి ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలకు కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్టు సమన్వయ కర్త కృష్ణారావు తెలిపారు. శుక్రవారం స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి గల అభ్యర్థులు shorturl.at/mvyF3 లింక్ ద్వారా వివరా లు నమోదు చేసుకోవాలన్నారు. 4 నెలల పాటు నిర్వహించే శిక్షణ తరగతులలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రూప్-2 ఆశావహులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80084 12798 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు యు.ఎస్.ఎన్. రాజు పాల్గొన్నారు.


రెడ్‌క్రాస్ సొసైటీకి గరివిడి వాసి




శీరపు లక్ష్మీనారాయణను పెదవాల్తేరులోని రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించిన సురేష్‌రెడ్డి

తగరపువలస: అంధుడైన 70 ఏళ్ల వృద్ధుడు శీరపు లక్ష్మీనారాయణ రెండు రోజులుగా చిట్టివలస సప్తగిరి థియేటర్ వద్ద రోడ్డుపై పడి ఉన్నాడు. స్థానికులు ఇచ్చింది తిని బయట చలిలోనే వణుకుతూ పడుకుంటున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆరాతీయగా.. తనది విజయనగరం జిల్లా గరివిడి అని, తమ అత్తవారిది తగరపువలస అని చెప్పాడు. భార్య పేరు రాధ, రెండో కుమారుడి పేరు కూర్మ అని ఆయన తెలియజేశాడు. మిగతా వివరాలు చెప్పలేకపోతున్నాడు. ఆయనకు వినిపించడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో సంతపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలాపు సురేష్ రెడ్డి, కుమ్మరవీధికి చెందిన ఫార్మా ఉద్యోగి పొట్నూరు పవన్.. కారులో ఆయనను తీసుకొచ్చి పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించారు. వృద్ధుని కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే సొసైటీలో సంప్రదించాలని సూచించారు.

108 రకాల స్వీట్లతో సారె సమర్పణ



సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



అమ్మవారికి నివేదించిన 108 రకాల స్వీట్లు

సీతంపేట: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం లలితా నగర్‌లోని లలితా పీఠంలో భోగి పండగ నాడు గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవారి భక్తులు శుక్రవారం సాయంత్రం సారె ఊరేగింపు నిర్వహించారు. పలువురు భక్తులు, మహిళలు పాల్గొని పసుపు, కుంకుమ, గాజులు, చీర, పువ్వులు, పండ్లు, 108 రకాల స్వీట్లు సారెలో ఊరేగించారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో అమ్మవారికి నివేదించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా ధారోత్సవాలు



అమ్మవార్ల చెంత పాశుర విన్నప పారాయణ చేస్తున్న స్థానాచార్యులు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నాలుగోరోజు ధారోత్సవాలు ఘనంగా జరిగాయి. వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఒక పల్లకిలో, మరో పల్లకిలో సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు, గోదాదేవి అమ్మవారిని తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లను అధిష్ఠంపజేసి పంచామృతాభిషేకం చేశారు. గంగధార వద్ద ఉన్న పురాతన మండపంలో స్వామిని, అమ్మవార్లను అధిష్ఠంపజేసి విశేష పూజలు నిర్వహించారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ప్రత్యేక అలంకరణకు టీటీడీ అర్చకులు పట్టు వస్త్రాలను తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు.



శ్రీవారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు